క్లుప్తంగా

బుర్రిపాలెంలో ఉచిత వైద్యశిబిరం



తెనాలిటౌన్: బుర్రిపాలెం గ్రామంలో సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఆంధ్రా హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 126 మందికి వైద్య పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు మాట్లాడుతూ కృష్ణ జయంతి రోజున ఏటా బుర్రిపాలెంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో 34 క్యాంపులు నిర్వహించామని, రాష్ట్రంలో మోడల్ హెల్త్ విలేజ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు. శిబిరంలో డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ వినీల్, డాక్టర్ అమర్, డాక్టర్ పవన్, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



తెనాలిటౌన్: గాంధీ నగర్‌లోని షిరిడిసాయి వృద్ధాశ్రమంలో బుధవారం శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. యోగ సభ్యులు లలిత్‌జాన్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, యోగ సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ పాండురంగపేటకు చెందిన 42 ఏళ్ల శివకుమారి మే 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకి కోసం వెతికినా.. ఫలితం లేకపోవడంతో కుమారుడు నరేష్ పోలీసులను మంగళవారం ఆశ్రయించాడు. ఆర్థి కారణాలతో వెళ్లిపోయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ తెలిపారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళ్తున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం అత్తోట వద్ద అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీలను ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది మంగళవారం గుర్తించారు. లారీ యజమానికి రూ.16 వేల జరిమానా విధించారు.

ప్రసన్నాంజనేయస్వామికి అభిషేకాలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరంలోని సువర్చలాసమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఉదయాన్నే వేద పండితులు పరాంకుశం అజయ్‌బాబు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగవల్లీదళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. కార్యక్రమాలను పొట్టి వీరేశం గుప్తా, కె.పేరారెడ్డి పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు

ఫిరంగిపురం: అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి.ప్రసూన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండాలపాడు గ్రామంలోని బీసీ–2లో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టునకు అర్హులైన వారు జూన్ 7లోగా దరఖాస్తులు ఫిరంగిపురం ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఇళ్ల మధ్యలో కొండ చిలువ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణం 15వ వార్డు పద్మశాలి బజార్‌లో కొండచిలువ బుధవారం రోడ్డుపై తిరగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో.. శాటిసేషన్ సిబ్బంది కొండచిలువను పట్టుకునేందుకు ప్రయత్నించినా కుదరలేదు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

- వాకౌట్ చేసిన టీడీపీ సభ్యులు
- ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల చర్చ


చైర్‌పర్సన్ ఖాలేదానసీం


వార్డుల సమస్యలను సమావేశంలో తెలుపుతున్న వైఎస్సార్ సీపీ సభ్యులు

తెనాలిరూరల్: తెనాలి పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. నిజ నిర్ధారణ కమిటీతో పనిలేదంటూ టీడీపీ సభ్యులు వాకౌట్ చేయగా, అజెండాలోని అంశాలను ఆమోదించడమే కాకుండా వార్డుల్లోని సమస్యలపైన వైఎస్సార్ సీపీ సభ్యులు సమావేశంలో చర్చించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో బుధవారం ఉదయం 11.30 గంటలకు చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీం అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. సమావేశానికి మొత్తం 39 మంది సభ్యులు హాజరయ్యారు. అజెండాలోని అంశాల ప్రస్తావనకు ముందుగా సభ్యుడు తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ, మార్చి సమావేశంలో చోటు చేసుకున్న పరిణామాలపై చైర్‌పర్సన్ ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ గురించి ప్రస్తావించారు. కమిటీ ద్వారా ఆ రోజు సమావేశంలో ఏం జరిగిందన్నది పలువురి అభిప్రాయాలు తీసుకోవడం జరిగిందని చెప్పారు. కమిటీలో టీడీపీ కౌన్సిలర్ కూడా మెంబర్‌గా ఉన్నారని, అయితే టీడీపీ సభ్యులు కమిటీ విచారణకు సహకరించడం లేదని చెప్పారు. వారు సహకరించనిదే తాము రిపోర్టు ఇవ్వలేమని చెప్పారు. దీనిపై టీడీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఘర్షణ జరిగిన రోజు చైర్‌పర్సన్ తన కుర్చీలోనే ఉన్నారని, అందరి ఎదుట జరిగిన దానికి కమిటీ ఎందుకని ప్రశ్నించారు. తమ సభ్యుడిపై దాడి చేసిన వైఎస్సార్ సీపీ సభ్యునిపై చర్యలు తీసుకోకుండా కమిటీతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. తీసుకుంటే చర్యలు తీసుకోండి..లేదంటే వదిలేయండి అంటూ సభ నుండి టీడీపీ సభ్యులంతా వాకౌట్ చేసి, వెళ్లిపోయారు. దీనిపై కౌన్సిలర్ త్రిమూర్తి మాట్లాడుతూ, చైర్‌పర్సన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అందరి ఎదుటే తమ సభ్యుడిపై దాడి జరిగిందని, ఇంకా కమిటీతో ఏం పని అని అన్నారు. టీడీపీ సభ్యుల వాకౌట్ అనంతరం సభను యథావిధిగా కొనసాగించారు. అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు. వైఎస్సార్ సీపీ సభ్యుల సూచన మేరకు జీరో అవర్ నిర్వహించి, ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, యాతాటి అనిల్, షేక్ ఇస్మాయిల్, ఆవుల కోటయ్య, తోక శిరీష, పెదలంక లక్ష్మీలావణ్య, పేరం సంజీవరెడ్డి, దాసరి వీరవసంతరావు, పెచ్చింగ్ సుభానీ, కె.యశోద, తిరుమలశెట్టి సామ్రాజ్యం తదితరులు తమ తమ వార్డుల్లోని సమస్యలను ప్రస్తావించారు. చిన్న చిన్న సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించడం లేదని వాపోయారు. ఆయా సమస్యలపై ఎంఈ కె.నాగమల్లేశ్వరరావు, కమిషనర్ జస్వంతరావు, అసిస్టెంట్ కమిషనర్ ఎం.వేణుగోపాలరావు, సిబ్బంది వివరణ ఇచ్చారు. అనంతరం అజెడాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు.

అఖిలాంధ్ర సాధు పరిషత్‌లో పునఃప్రతిష్ఠా మహోత్సవం


ప్రతిష్ఠ అనంతరం పూజలు

తెనాలి: పట్టణంలోని అఖిలాంధ్ర సాధు పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడు, కాశీవిశ్వనాథ శివలింగ పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. నాజరుపేటలోని సాధు పరిషత్ కార్యాలయంలో విశేష హోమాలు, పంచామృతాభిషేకాలను జరిపి, విగ్రహాలను ప్రతిష్ఠించారు. గత నెల 29 నుంచి మూడురోజులపాటు శ్రీపరా విద్యానందగిరి మాతాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను జరిపారు. బుధవారం యంత్ర సహిత స్థాపిత దేవతా పూజలు, గర్త సంస్కరణ, రత్నన్యాసం, బీజన్యాసం చేశారు. ఉదయం 8.12 గంటలకు శ్రీ సాధు మహాత్ముల చేతులమీదుగా యంత్ర, శ్రీకృష్ణ పరమాత్మ, శ్రీకాశీ విశ్వనాథ శివలింగ ప్రతిష్ఠాపనను ఎంతో వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాధు పరిషత్ కార్యదర్శి కోరట్ల జగదీశ్వరానందగిరి పర్యవేక్షించారు.

ఉద్యోగాలకు 22 మంది విద్యార్థుల ఎంపిక

తెనాలి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎస్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్త డిగ్రీ కాలేజిలో ఫిన్‌కేర్ బ్యాంక్ సెంటర్ మేనేజరు ఉద్యోగాలకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కాలేజీకి చెందిన ఫైనలియర్ బీకాం, బీఎస్సీ విద్యార్థులు 22 మంది ఉద్యోగాలను సాధించారు. కాలేజి ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.1.56 లక్షల వేతనం, ఉచిత వసతి, టీఏ, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కూడా ఉన్నాయని బ్యాంక్ హెచ్‌ఆర్ మేనేజరు జె.రాజీవ్ వెల్లడించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను పొట్టి శ్రీరాములు విద్యాసంస్థల అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, మేనేజరు డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.దశరథరామిరెడ్డి, కేవీ రవికుమార్, ఎస్‌కే రఫీ, నాగరాజు ఆరాధ్యుల, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అశ్విని తలశిల, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రజలందరిపై భావనారుషి ఆశీస్సులు

నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: భావనారుషి స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలన్న ఆకాంక్షను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వ్యక్తం చేశారు. స్థానిక షరాఫ్ బజారులోని భావనారుషి దేవాలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం మూడు రోజులుగా వేడుకగా జరుగుతోంది. బుధవారం జరిగిన ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. తెనాలిలోని శ్రీ భద్రావతి సహిత శ్రీ భావనారుషి స్వామి దేవాలయంలో 112 సంవత్సరాల తర్వాత ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ జరుగుతోందని చెప్పారు. ఈ మహోత్సవంలో పాల్గొనటం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. స్వామివారి ఆశీస్సులు సంఘీయులతోపాటు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు, పద్మశాలీయ సంఘీయులు, అర్చకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీభద్రావతి సహిత భావనారుషి స్వామిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. పద్మశాలీ సంఘ అధ్యక్షుడు బట్టు జగత్‌కోటి నరేంద్రబాబు, దేవస్థాన కమిటీ చైర్మన్ బిట్రా రామలింగేశ్వరరావు, కార్యదర్శి కొడాలి క్రాంతికుమార్, సభ్యులు తాడిపర్తి చంద్రశేఖర్, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, రమణ, గుంటి ధనలక్ష్మి, గుంటి వెంకట్, తాడిపర్తి ప్రసాద్, జొన్నాదుల వెంకటేశ్వరరావు, కృష్ణ ప్రభృతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. సుమారు 35 ఏళ్ల వ్యక్తి సోమవారం మధ్యాహ్నం తెనాలి రైల్వే స్టేషన్‌లో రైలు దిగే క్రమంలో ప్లాట్‌ఫాంపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. 108లో తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు తెనాలి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సినీ రంగంలో నవశకాన్ని ఆవిష్కరించిన కృష్ణ

సూపర్ స్టార్ 81వ జయంతి సభలో ఎమ్మెల్యే శివకుమార్


కృష్ణకు పుష్పాంజలి ఘటించి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్


కృష్ణ కాంస్య, ఫైబర్ విగ్రహాలతో శిల్పులు

తెనాలి: నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, సినీ స్టూడియో అధినేతగా ఎన్నో సాహసోపేత ప్రయోగాలతో సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ సినీ రంగంలో నవశకాన్ని ఆవిష్కరించారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్లో బుధవారం సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ 81 జయంతిని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బూరెల దుర్గాప్రసాద్, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, కె.యశ్వంత్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే శివకుమార్ కృష్ణ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అక్కడే పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభలో ఆయన మాట్లాడుతూ తెలుగు సినిమా వెండి తెరపై ఉన్నతంగా వెలుగొందటానికి హీరో కృష్ణ చేసిన ప్రయోగాలు మరపురానివని కొనియాడారు. తొలి సినిమా స్కోప్, 70 ఎంఎంలో సినిమా ప్రదర్శనకు ఆద్యుడు హీరో కృష్ణగా గుర్తుచేశారు. కౌబాయ్ పాత్రలో నటించి తీసిన మోసగాళ్లకు మోసగాడు ఆనాడు పాన్‌ఇండియా సినిమాగా రికార్డులు సృష్టించిందన్నారు. పద్మాలయ బ్యానర్‌పై తీసిన సింహాసనం సినిమాలో రెండు భాషల్లో నటించి, దర్శకత్వం వహించిన ఘనుడు కృష్ణ అన్నారు. కృష్ణ అభిమానులు అందరూ కలిసి సమాజానికి ఉపయోగపడే సేవలను అందించటం అభినందనీయంగా చెప్పారు. తెనాలిలో నిర్మాణంలో ఉన్న తెనాలి బండ్‌పై హీరో కృష్ణ విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని అభిమానుల హర్షధ్వానాల మధ్య వెల్లడించారు. కృష్ణ ఫ్యాన్స్ అవుతు రాజశేఖరరెడ్డి, భాస్కరుని లక్ష్మీనారాయణ, మహేశ్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు షబ్బీర్ అఖిల్, కోటేశ్వరరావు, నేత్రాలయ సుభాని, బొర్రా ఏడుకొండలు, కార్తికేయ, బాబీ, మహేష్, కఠారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ చిత్రపటానికి మాజీ మంత్రుల నివాళి

తెనాలి: పట్టణ వహాబ్ చౌక్‌లోని కౌన్సిలరు త్రిమూర్తి కార్యాలయం ఎదుట బుధవారం సూపర్‌స్టార్ కృష్ణ జయంతిని నిర్వహించారు. మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనంద్‌బాబు హాజరై, కృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నటశేఖరుడు కృష్ణ సినీ రంగానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నిర్మాతలకు చేదోడువాదోడుగా వ్యవహరించేవారని చెప్పారు. కౌన్సిలర్లు త్రిమూర్తి, యుగంధర్, బోయపాటి అరుణ, టీడీపీ నాయకులు శాఖమూరి నారాయణ ప్రసాద్, రావి సూర్యకిరణ్ తేజ, ఈదర వెంకట పూర్ణచంద్, సయ్యద్ షావుల్, పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్న వితరణ చేశారు.

కొలువుదీరిన కృష్ణ విగ్రహాలు..

తెనాలి: సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ జయంతిని పురస్కరించుకుని ఆయన స్వస్థలమైన బుర్రిపాలెంలో ప్రతిష్ఠించేందుకు కృష్ణ కాంస్య విగ్రహాన్ని స్థానిక సూర్య శిల్పశాల నిర్వాహకులు రూపొందించారు. దీనితో పాటు కృష్ణ ఫైబర్ విగ్రహాలను తయారు చేశారు. కృష్ణ జయంతి రోజున బుధవారం ఈ విగ్రహాల్ని శిల్పశాల ఎదుట ప్రదర్శనకు ఉంచారు. బుర్రిపాలెంలో కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఆయన తనయుడు, సినీ నటుడు మహేశ్‌బాబు త్వరలోనే ఆవిష్కరిస్తారని శిల్పకారులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర తెలియజేశారు. అభిమానుల కోరిక మేరకు కృష్ణ త్రీడీ విగ్రహాలను వివిధ సైజుల్లో రూపొంది స్తున్నట్టు వివరించారు.

చినరావూరు పార్క్ వద్ద కృష్ణ జయంతి

తెనాలి: సూపర్‌స్టార్ కృష్ణ జయంతిని స్థానిక చినరావూరు పార్కు వద్ద అభిమానులు ఘనంగా నిర్వహించారు. కృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. చెరుకూరి సుబ్బారావు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి, మజ్జిగ పంపిణీ చేశారు. మైక్ మురళి, రామినేని వెంకటేశ్వరరావు, రాజబాబు, ప్రసాద్, దుర్గ, నుసుము సాంబయ్య, నాయుడు శ్రీను, సాయికృష్ణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.


హీరో కృష్ణ చిత్రపటానికి రాజా, ఆనంద్‌బాబు నివాళి


కృష్ణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు

పొగాకు అనర్థాలపై వినూత్న ప్రచారం


విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

తెనాలి: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్వీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో అవగాహన ర్యాలీ చేశారు. కాలేజ్ నుంచి విద్యార్థులంతా పొగాకు వ్యతిరేక నినాదాలతో మార్కెట్ పుర వేదిక వరకు ర్యాలీగా వచ్చారు. అక్కడ మానవహారంగా ఏర్పడి, పొగాక వ్యతిరేకత ముఖ్య లక్ష్యాన్ని, వాటివల్ల జరిగే అనర్థాలను విద్యార్థినీ విద్యార్థులు వేర్వేరుగా ఫ్లాష్ మాబ్‌తో కళ్లకు కట్టినట్టు చూపారు. పొగాకు వల్ల కలిగే నష్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేయాలనే భావనతో ప్రజలకు అవగాహన కల్పించటమే కార్యక్రమ ఉద్దేశమని కాలేజి కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ చెప్పారు. టూ టౌన్ సీఐ ఎస్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పొగాకుకు వ్యతిరేకంగా విద్యార్థులు కార్యక్రమాన్ని చేపట్టటం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామారావు మాట్లాడుతూ పొగాకు వల్ల కలిగే నష్టాలు, క్యాన్సర్‌కు దారితీసే తీవ్రతను వివరించారు. కాలేజి అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది, కార్య నిర్వహణ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు, సురేష్, అజయ్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా కుర్రా శ్రీను


నియామకపత్రం అందజేస్తున్న కేసన శంకరరావు

తెనాలి: శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడిగా, రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ సభ్యుడిగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కుర్రా శ్రీను ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. స్థానిక రైల్వే స్టేషను రోడ్డులోని బృందావనం హోటల్‌లో బుధవారం తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం పట్టణ అధ్యక్షుడిగా కుర్రా శ్రీనుకు నియామకపత్రాన్ని అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం ద్వారకా శ్రీను, మహిళా కో–ఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, నియోజకవర్గ సంయుక్త కార్యదర్శి తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ యాదవ్, ఎం.నాగదుర్గా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయాలన్నదే సీఎం జగన్ సిద్ధాంతం


మాట్లాడుతున్న పి.నాగార్జునరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు పి.నాగార్జునరెడ్డి

కొల్లిపర(తెనాలి): నమ్మిన సిద్ధాంతాలను వాస్తవ రూపంలోకి తీసుకొచ్చి ప్రజలకు మంచి చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటారని, చంద్రబాబు పాల సీ మాత్రం నిత్యం అబద్ధాలు చెప్పటం, నమ్మినవారిపై చేతులు పెట్టి నట్టేట ముంచటమేనని రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు పి.నాగార్జునరెడ్డి అన్నారు. తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామాల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఉపాధిహామీ పనుల నుంచి జగనన్న కాలనీలు, రైతు భరోసా కేంద్రాల నుంచి, సచివాలయాలు, ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల సహా పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి సేవలు అందుతున్నాయి? ఇంకా ఏవైనా సమస్యలున్నాయా? అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరునూ తెలుసుకున్నారు. శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం కలెక్షన్ సెంటర్‌కు వెళ్లి, సంఘ పనితీరును స్వయంగా చూశారు. భోజన విరామ అనంతరం ఎంపీపీ కార్యాలయంలోని సమావేశపు హాలులో వివిధ సమావేశాలను నిర్వహించారు. తొలుత డ్వాక్రా మహిళలు, వీఏలు, వీవోలతో, తర్వాత పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. వారి కార్యకలాపాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చంద్రబాబు సొంత మామపై చేతులుపెట్టి, ఆయన మరణానికి కారకుడైనట్టు నాగార్జునరెడ్డి గుర్తుచేశారు. బావమరిది హరికృష్ణ రాజ్యసభకు రాజీనామా చేసినపుడు, కారణం తెలుసుకుని కొనసాగేలా చూడకుండా, కనీసం అడగలేదన్నారు. అలాంటి చంద్రబాబు ఇప్పుడు ప్రజలను పట్టించుకుంటానంటూ తిరుగుతుంటే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. రాజధానిలో పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తుంటే కోర్టులో కేసులు వేయించారని, ప్రతి విషయంలోనూ అడ్డుపడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని చెప్పారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని నిందలేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఏవైతే హామీలనిచ్చారో 99 శాతం నెరవేర్చినట్టు గుర్తుచేశారు. నాలుగేళ్లలో రూ.2.25 లక్షల కోట్ల సంక్షేమాన్ని అర్హత గల పేదలందరికీ నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్టు చెప్పారు. విద్య, వైద్యం రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలను తీసుకొచ్చినట్టు చెప్పారు. వ్యవసాయరంగాన్ని ఆదుకుంటున్నారని తెలిపారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి, తెనాలి మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల నేత ఆరిగ చంద్రారెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు తమ్మా సుజాత వేదికపై ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

నిజాంపట్నం: నేరాల నియంత్రణకు గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని రేపల్లె రూరల్ సీఐ ఎ.శివశంకర్ సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై మండలంలోని బావోజీపాలెం గ్రామంలో వ్యాపారులకు బుధవారం అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేయటంతో దొంగతనాలు నివారించవచ్చని, ఆకతాయిల అల్లర్లను కట్టిపెట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. వ్యాపారులు తమ దుకాణాల్లో తప్పనిసరిగా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట నిజాంపట్నం ఎస్ఐ రమేష్ తదితరులున్నారు.